
ఈ వారం తెలుగు పుస్తకం

# వ్యక్తివాద సాహితీ రసహేల

# హిమజ్వాల

మధురాంతకం నరేంద్ర



**Author:** Chandidas Vaddera
**Subject:** NOVELS
**Publisher:** Alaknanda
**Year of Publication:** 2005
**Price:** USD $ 4.62

వడ్డెర చండీదాస్ గారి 'హిమజ్వాల' 1972-73లలో ఆంధ్రజ్యోతి వార పత్రికలో సీరియల్‌గా వెలువడింది. అయితే యీ నవలకు అర్థాను(స్వా)సారం అనే పేరుతో రచయిత రాసిన 'వెనకమాట' లో ఆయన తానీ నవలను 1961లోనే రాయడం ప్రారంభించానని, అప్పుడు కేవలం మొదటి అధ్యాయం మాత్రమే రాసానని, ఆ తర్వాత 1968 లో ప్రారంభించి, వొక్క వూపులో ఐదు మాసాల్లో పూర్తి చేశానని అంటారు. తన రచన సమకాలీన సమాజ దర్పణం గా వెలువరించాలనే వుద్దేశం చండీదాసుగారికి లేదు. 'పాఠకులు దేశకాల పరిమితం గాదు. రచన గూడా దేశకాల పరిమితం కాగూడదు' అంటారాయన.

యేదో వొక దేశకాల నిర్దుష్టాలైన విషయాలను గురించి రాసేవీ, దేశకాలాతీతమైన మనవ స్వభావాన్ని అవలోకించేవీ-అంటూ రచనల్ని రెండురకాలుగా విభజించవచ్చు. అయితే దేశానికీ, కాలానికీ అతీతంగా జీవించడం. మానవుడికి సాధ్యమేనా?-అన్నది ప్రశ్న. సాధ్యం గాదు. రెండోరకపు రచనల్లోని వ్యక్తులు కూడా యేదో వొక సమాజంలో, యేదో వొక కాలంలో జీవిస్తున్నవారే.

అయితే సమాజానికి భిన్నంగా, యింకా మాట్లాడితే సమాజాన్ని పట్టించుకోకుండా జీవిస్తున్న వాళ్ళు వారు. నిజానికి ఇటువంటి నవలలు సమాజాన్ని వ్యతిరేకించే వ్యక్తి వాదులకూ, వాళ్ళని నియంత్రించే సమాజానికీ మధ్య వుండే పోరాటాలనే యెక్కువగా చిత్రిస్తాయి. 'హిమజ్వాల' లోని మొదటి ఆరు అధ్యాయాలూ రెండవ కోవకు చెందినవయితే, చివరి అధ్యాయం మాత్రం మొదటి కోవకు చెందుతుంది.

'తెలుగుతనపు కూపంలో యిమడలేక అభాసుపాలైన కళాతపస్వి శ్రీ బుచ్చిబాబుగారి స్మృతికి' అనే అంకితం మాటలతోనే చండీదాస్‌గారు తనపైన బుచ్చిబాబుగారు నెరపిన ప్రభావాన్ని స్పష్టంగా వెల్లడి చేస్తారు. అధ్యాయ విభజనల్లో, ఆయా అధ్యాయాలకు పెట్టిన కవితాత్మకమైన పేర్లలో, నాటకీయత-శుద్ధ కథా కథనం - చేతనా స్రవంతి - యీ మూడింటినీ సంలీనం చేసే నవలీకరణంలో - హిమజ్వాల బుచ్చిబాబుగారి 'చివరకు మిగిలేది' నవలనే అనుసరిస్తుంది. బుచ్చిబాబుగారి 'చివరకు మిగిలేది', కథానాయకుడైన దయానిధి అన్వేషణను మాత్రమే చిత్రిస్తుంది. 'హిమజ్వాల' నవలకు రచయిత గీతాదేవి, కృష్ణచైతన్య- అనే యిద్దరు ప్రధాన పాత్రలను

యెన్నుకున్నారు. 'వెలుతురుమరక' అనే మొదటి అధ్యాయంలోనూ, 'సశేషమ్ జీవితం' అనే చివరి అధ్యాయంలోనూ, ముఖ్యపాత్రధారులిద్దరూ వుంటారు. మిగిలిన అయిదు అధ్యాయాల్లో గీతాదేవికి మూడు అధ్యాయాలూ, కృష్ణచైతన్యకు రెండు అధ్యాయాలు కేటాయించబడ్డాయి. 1960 ల్లోనే రచయిత లో రూపుదిద్దుకున్న యీ ఇతవృత్తంలో 61 లో మొదటి అధ్యాయం మాత్రమే రాయగల్గిన యీ నవలలో, క్రమంగా గీతాదేవి ప్రాబల్యం పెరిగి, కృష్ణచైతన్య కున్న ప్రాముఖ్యత రెండవదిగా మారడం గమనించవలసిన విషయం.

మొదటి అధ్యాయంలో గీతాదేవి, కృష్ణచైతన్యలనిద్దరినీ రచయిత వొకేరకమైన నిర్మమతత్వంతో ( **Detachment** ) చిత్రించాడు.అయితే మిగిలిన భాగాన్ని వెంటనే రాయలేకపోవడానికీ, ఆ తరువాతి భాగాన్ని వొక్క వూపులో రాయగలగడానికీ వెనక ఆ యేడు సంవత్సరాల వ్యవధిలో రచయితలో - ఆయనకు తెలియకుండా గూడా గావచ్చు - జరిగిన మార్పు కారణం గావచ్చు. రెండో అధ్యాయం ప్రారంభం నుంచీ క్రమంగా ఆ మార్పు వికసిస్తూ వచ్చి నాలుగూ, అయిదు అధ్యాయాల్లో పూర్తిగా పల్లవిస్తుంది. కేవలం రచన పరిపూర్ణత కోసం, రచయిత పనిగట్టుకుని రాసినట్టుగా కన్పించే ఆరవ అధ్యాయం ('మరీచికాన్వేషణ' - కృష్ణచైతన్య అన్వేషణ పథం) యిందుకు బలమైన వుదాహరణ. రచయిత తనకు తెలియకుండా గీతాదేవితో మమేకమై పోవడమే - అందుకు కారణభూతమైన మార్పు. మరోవిధంగా చూసినప్పుడు అది రచయితే తన పాత్రను ఎక్కువగా ప్రేమించడంగా కూడా కనిపిస్తుంది. ప్రపంచ సాహిత్యంలో యివి రెండూ సామాన్యంగా యెదురయ్యే పరిస్థితులే!

'హిమజ్వాల' ను విమర్శకులు మనోవైజ్ఞానిక నవల, అస్తిత్వ వాద నవల అనే రెండు తరగతుల క్రింద చేర్చారు. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన సిద్ధాంతాలను నవలలో పాత్రల ద్వారా ప్రతిపాదించడాన్ని యింగ్లాండులో డి.హెచ్.లారెన్స్ వంటి వారు చేపట్టారు. 'చివరకు మిగిలేది' నవలలో సైతం బుచ్చిబాబు 'యీడిపస్ కాంప్లెస్'ను దయానిధి పాత్రలో స్పష్టంగా చూపెడతాడు. 'హామ్లెట్' నాటకం గురించి అయిదారు పేజీల చర్చను సైతం కొనసాగించాడు. హిమజ్వాల లోని కృష్ణచైతన్యలోనూ 'మదర్‌ఫిక్సేషన్' ను రచయిత పాత్ర అంతరంగ కథనంలో చూపెడతాడు. సబితాసిన్హా అనే పాత స్నేహితురాలూ, గీతాదేవీ తమకు కావలసినదాన్ని సైతం అవతలి వ్యక్తి యివ్వగలిగితేనే తీసుకోగలిగినవాళ్ళు. మాధురి వంటి **extrovert** - అంతర్గత సంఘర్షణకు తావివ్వని - వ్యక్తి మాత్రమే తనకు కావలసినదాన్ని బలవంతంగానైనా అందిపుచ్చుకోగలరు. మాధురి సాంగత్యంలో మాత్రమే చైతన్యకున్న మదర్ ఫిక్సేషన్ విడిపోతుంది.

గీతాదేవిలో ఎలక్ట్రా కాంప్లెక్స్‌ను చిత్రించాలన్న రచయిత వుద్దేశం మొదటి అధ్యాయంలోనే తెలిసిపోతుంది. ఆమె మాటల్లోనూ, అంతరంగ స్రవంతిలోనూ చివరి వరకూ వెంటాడే జ్ఞాపకం, ప్రభావం, తండ్రే! 'తార్కిక శిఖరాల మీద జిజ్ఞాసా మేఘాల నీడలో వునికిని మరచినవాడిలా' వుండే కృష్ణచైతన్యకు మొదట్లో గుడ్ బై చెబుతూ ' ప్రొఫెసర్‌గారూ మనిషికి ఆకలేసేది వొక్క కడుపులోనే గాదు' అని వుత్తరం రాస్తుంది గీతాదేవి. భార్యాభర్త సంబంధాన్ని కేవలం యాంత్రికమైన 'క్రతువు' గా భావించే భర్త శివరాంతో "అవును నేను కామపిశాచినే. ఆత్మని చంపుకుని, కళ్ళు మూసుకుని, తిమ్మిరి వొదిలించుకోలేని కామపిశాచిని. యేడాదులుగా వెన్నెట్లో తడుస్తూ, పుష్పాల సౌరభాన్ని కప్పుకుని, లోకాన్ని క్రమ్మి వేయబోయిన చీకట్లను ప్రోది చేసి ముడి చుట్టుకుని, నీలగిరుల నుదుటి మీద యీ పెదవులు ఆన్చి, అనంత విశ్వాన్ని నా కౌగిటిలో యిముడ్చుకుని -

సమస్త దిశాతీత విభ్రమణ భంగిమలో రాగరంజితంగా రమిస్తున్నాను ; కసితీరా విషయిస్తున్న కామపిశాచిని - వొక్క నీతో తప్ప. నేను యింతవరకూ నిన్ను తాకి యెరగను. నిన్ను శీలవంతునిగా వొదిలేశాను. దాన్ని నీ గాజు గుండెలో దాచుకుని నిద్రపో!" అంటుంది. ఆమెకు కావలసిన రసజ్వలనం విజయసారథి సాన్నిధ్యంలోనే దొరికింది.

దాదాపు అరవయ్యేళ్ళ ముసలి వ్యక్తి - పదవీవిరమణ చేయబోతున్న వ్యక్తి - విజయసారథిని ఆమె మనసా వాచా ప్రేమిస్తుంది. 'ప్రేమించడం మేధతో చేసే పని కాదు. ప్రేమించాననుకోవడం నిజంగా ప్రేమించటం గాదు. ప్రేమకి వివేకావివేకాలు తెలియవు. అది వుత్త వెర్రి బాగులది... రాగరంజిత రసానుబంధం' అంటుందావిడ. "హృదయానికి కళ్ళు లేవు. స్పర్శ మాత్రమే ఉంది. మేధకి కళ్ళున్నాయి గానీ స్పర్శలేదు. అనుకుని యెవరూ ప్రేమించరు; ప్రేమించలేరు -అది యిట్టే సంభవిస్తుంది." అని ఆమె భావిస్తుంది. విజయసారథితో లభించిన అనుభవాన్ని అపూర్వమైందిగానూ, అమూల్యమైనదిగానూ గుర్తిస్తుంది. అయితే ఆ అనుభవాన్ని మాత్రమే జ్ఞాపకం చేసుకుంటూ సుదీర్ఘమైన శేషజీవితాన్ని శుష్కంగా, నిస్త్రాణంగా సాగించాలనే మూర్ఖపుటాలోచన కూడా తనకు లేదంటుందామె. విజయసారథి కృష్ణచైతన్యకు తండ్రని తెలిసినా, అతని మరణానంతరం కృష్ణచైతన్యతో జీవితాన్ని పంచుకోడానికి సందేహించదు.

తనలో యేర్పడిన 'మానసికస్తంభన'(**psychological complex** కు చండీదాస్‌గారి అనువాదం) తొలగిపోయిన తర్వాతి కృష్ణచైతన్య మునుపటి మనిషి కాడు. గీతాదేవి స్మృతుల్లోంచీ పారిపోవడం కోసం అర్థం లేకుండాతిరిగి వొళ్ళు పాడు చేసుకున్నాడు. గీతాదేవి జీవితం అర్థరహితమైపోతుందని తెలుసుకున్నాడు. అందుకే లోకాన్ని ధిక్కరించి తండ్రితో జీవితం పంచుకున్న స్త్రీని సహచరిగా ఆహ్వానించడానికి సిద్ధపడతాడు.

సరిగ్గా ఆ సమయానికి అనుకోకుండా శివరాం తారసిల్లడం, గీతాదేవి వెళ్ళిపోయిన తర్వాత అతను పిచ్చివాడై వూళ్ళు తిరిగిన సంగతులంతా తెలియడం, అతను ఆమె ప్రేమ భిక్ష కోసం పరితపించడం, గీతాదేవి అతణ్ణి గజ్జికుక్కగా భావించడం, చివరకు శివరాం ' పోనీ అతనితోనూ -అతనతో కూడా వచ్చేసెయ్యి - నీ యిష్టం' అనేంతగా తయారవడం, భర్త అన్న హోదాలో అతను బలవంతం చేయబోవడం, అతని చేతుల్లో హత్య గావించబడడం, అతనూ బలవన్మరణం పొందడం - అంతా హడావుడిగా, నాటకీయంగా, - కొంత కృత్రిమంగా కూడా - జరిగిపోతాయి. 'అన్నాకెరినానా' నవల ముగింపు సైతం యేదో పనిమీద రైల్వేస్టేషనుకెళ్ళిన అన్నా క్షణికమైన వైరాగ్యంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటుంది. అయితే యీ రకమైన బలవంతపు ముగింపు' ల వెనకే రచయిత చెప్పదలచుకున్న విషయం, ఆయన పాడదలచుకన్న విషాద గీతిక స్పష్టంగా నినదిస్తూ ఉంటుంది.

"నేనెవరినో యెలా తెలుస్తుంది? అనుభవం తెలుసుకోలేని విషయాన్ని నేను మాత్రం తెలుసుకోగలనా?" అని ప్రశ్నించే గీతాదేవి అస్తిత్వ వాది. చండీదాస్ వ్యక్తి వాది. వ్యక్తి వినా సమాజం లేదని ఆయనంటాడు. "సంఘజీవనం అవసరార్థం మాత్రమే. సంఘజీవనం అనేది యెవరి జీవనమూ కాదు. అది సామాన్య లక్షణం కావచ్చు.

ప్రతి దానికీ సంఘాన్ని తిట్టడం, వ్యక్తి తన విలువనీ, విశిష్టతనీ కోల్పోయి బాధ్యతారాహిత్యంలోకి దిగజారటమే ... సాంఘిక దురాచారాలు - అంటే నీలోని నాలోని దురాచారాలు. అలా అని; సంఘం అనే భావం, అప్రాముఖ్యం అనికాదు నా ఉద్దేశ్యం... మానవుడు సంఘజీవి అన్నారు. అంటే సంఘంలోకి చొరబడి జీవిస్తాడని కాదు. సంఘం అనేది వ్యక్త్యంతర్గత జనితం. బాహ్య వాతావరణమే  సంఘం కాదు"... అంటాడాయన. సంఘంలో మార్పు రావడానికి వ్యక్తిలో మార్పు రావడమే ప్రాతిపదిక. అయితే వ్యక్తి వాదాన్ని తిరోగమన వాదంగా భావించే వాళ్ళు లేకపోలేదు.

'హిమజ్వాల' కు రాసిన పీఠికలో పురాణం సుబ్రహ్మణ్య శర్మ "వ్యక్తి వాదం వర్గ స్వభావాన్ని దాచుకుందుకు వుపయోగపడే ముసుగు మాత్రమే! ఈ వ్యక్తి వాదం, రాజకీయాల్లో తటస్థ వాదం లాంటిది. తటస్థ వ్యక్తివాది యథాస్థితివాదాన్ని సమర్థిస్తున్నట్టు గుర్తుంచుకోవాలి. మానవతావాదులూ, వ్యక్తివాదులూ మార్పును వ్యతిరేకిస్తారు. సాహిత్యానికీ, రాజకీయాలకూ వుండే సంబంధాన్ని తెలుసుకోలేకపోయిన రచయిత శక్తి సమాజానికి ఉపయోగపడకుండా తోమిన చెంబుల్లాంటి కళాఖండాల్ని సృష్టిస్తూ పోతుంది" అని వ్యాఖ్యానిస్తాడు. అయితే వడ్డెర చండీదాస్‌గారికి పురాణం గారి మాటలతో యేకీభావం లేదన్న విషయం స్పష్టంగానే తెలిసిపోతుంది."స్థూలదృష్టిలో సంఘం అంటే ప్రజాబాహుళ్యామోద్యత అని నా అభిప్రాయం. సంఘానికీ, వ్యక్తికీ మధ్య సారూప్యతా, వైవిధ్యమూ ఉన్నాయి. సంఘం సిరామరకలాంటి నీడ. ఆ నీడలో అందరి నీడలూ ఉంటాయి కాని, అవి కలగాపులగంగా అలుముకుని, పులుముకుని, మరకల్లా అనిపిస్తాయి.  ఆ మరకలో యే వొక్క వ్యక్తీ,తన నీడ ఫలానా అని పోల్చుకోలేడు." అంటాడాయన. అందుకే సంఘమనే నీడలోంచీ వ్యక్తిని విడదీసి, స్పష్టంగా అతన్ని పరిశీలించడానికి పూనుకుంటాడు.

అయితే వ్యక్తి వాదపు పరిమితుల్నీ, బలహీనతల్నీ కూడా చండీదాస్ స్పష్టంగా గుర్తించాడనడానికి ఆయన నవల కిచ్చిన ముగింపే తార్కాణం. యింతకూ గీతాదేవి అన్వేషణ దేనికోసం?ఆమె కోరుకున్న గమ్యమేది? దాన్ని చేరుకోవడం సాధ్యమేనా? నవల ముగింపు యీ ప్రశ్నలకున్న సమాధానాల్ని బట్టి  ఆధారపడి వుంటుంది.

గీతాదేవి యెవరు? " నువ్వు నిజంగానే చిత్రమైన దానివి. కథల్లో మనిషిలాగా వున్నావు. తెలుగువాళ్ళల్లో నీలాంటి మనిషి వున్నట్లు ఎవరైనా చెప్తే నమ్మకపోయివుందును" అంటాడు శివరాం. అప్పుడు గీతాదేవి "నేను తెలుగుదాన్ననెవరు చెప్పారు! అనగా అనగా వో రచయిత రాయని పుస్తకంలోంచి పారిపోయి వొచ్చినదాన్ని. ఆ పైన నా మాట నమ్మండి, నమ్మకపోండి" అంటుంది. 'అర్థానుస్వారం'లో రచయిత "ఈ పుస్తకంలోని పాత్రలు పడిన తపన, తెలుగు అక్షరాలను తొడుక్కుని దర్శనమివ్వటానికి ప్రయత్నించింది." అంటాడు. వెరశీ గీతాదేవి పాత్ర మాత్రమే గాదు. విజృంభించిన వ్యక్తివాదానికి ప్రతీక. సమాజపు కట్టుబాట్లకు లొంగని వ్యక్తివాదపు బావుటా. అయితే ప్రతి  వ్యక్తిలోనూ, యేదో వొక రీతిలో కొంత అరాచకతృష్ణ - **anarchic yearning**- హేతువు, బుద్ధీ, వివేచనాలకు అతీతమైన తృష్ణ వుండనే ఉంటుంది.

తత్ఫలితంగా అతడికీ, సంఘానికీ మధ్య పోరాటం సంభవిస్తూనే వుంటుంది. వ్యక్తి తన పరిమితులు తెలుసుకోకపోవడం, అందరానిదాని కోసం అర్రులు చాచడం, తన జీవితాన్ని తానే పాడుచేసుకోవడం - యిదొక సార్వజనీనమైన సార్వకాలికమైన జీవిత పార్శ్వం. తన వివాహేతర సంబంధానికీ, మాతృత్వానికీ మధ్య నలిగి కృశించి పోయిన అన్నా కెరినానా (టాల్‌స్టాయ్ నవల); తన కర్తవ్యానికీ వివేచనలకూ మధ్య జరిగిన పోరాటంలో జీవితాన్నే పోగొట్టుకునేలా ఆలస్యం చేసిన హామ్లెట్; తననే నెపోలియన్ గా భావించుకుని, పకడ్బందీగా హత్య చేసి, తన పశ్చాత్తాపపు బరువు క్రింద కృంగిపోయిన రాస్కల్నికొవ్ (డాస్టోవిస్కీ నవల క్రైమ్ అండ్ పనిష్‌మెంట్) లలాగా గీతాదేవి కూడా వొక సార్వజనీనమైన జీవిత పార్శ్వపు ప్రతీక.

'హిమజ్వాల' వొక ఐడియలజికల్ నవల. గీతాదేవి వొక ఐడియా. అయితే వొక ఐడియాను ఒక పాత్రగా మలచడంలోనూ, దానికి జవజీవాలు సమకూర్చడంలోనూ రచయిత ప్రతిభ బయటపడుతుంది. "యథార్థాన్ని స్వప్నంలోంచీ, స్వప్నాన్ని యథార్థంలోంచీ వడపోస్తుంది సాహిత్యం" అంటాడు చండీదాస్. గీతాదేవి కలలాంటి వాస్తవం; వాస్తవంలాంటి కల. ఆమె చుట్టూ వొక యథార్థమైన, వాస్తవమైన సమాజాన్ని సృష్టించడం ద్వారా రచయిత ఆమెను వొక సజీవ పాత్రగా మార్చగలిగాడు. స్త్రీ పురుష సంబంధాలను గురించిన నవలగా పరిశీలిస్తే గీతాదేవి -కృష్ణచైతన్యల చుట్టూ ఆయన అనేక రకాల సంబంధాలను పరిచయం చేస్తాడు. భార్యాభర్తల సంబంధాన్ని కేవలం వొక తాత్కాలిక సాంఘిక విలువగా భావించే పద్మ-ఆమె భర్త; వ్యాధిగ్రస్తుడైన భర్తను నిరాదరణ చేసే మాధురి; గీతాదేవిపైన అసూయపడే శివరాం మరదలు సుజాత; పెళ్ళినే జీవితపరమార్థంగా భావించే కృష్ణచైతన్య మరదలు నిర్మల....యిలా యెన్నో రకాల వ్యక్తులు మానవసంబంధాలు...యివన్నీ సజీవమైనవి మాత్రమేగాదు. పరస్పరం పోల్చి చూడడం ద్వారా వైరుధ్యాల్ని తెలిపేవి కూడా!

గీతాదేవిని ఆమె తండ్రి **Intrinsic aesthetic embodiment** అని అంటాడు. యెంతో అవసరమైతే గానీ యింగ్లీషు మాటలు వాడనని చెప్పకున్న చండీదాస్ గారు యిక్కడ మాత్రం యింగ్లీషునే వాడారు. సహజసిద్ధమైన/స్వాభావికమైన సౌందర్య స్వరూపం- మొదలైన అనువాదాల్ని పరిశీలించి, చివరకు యింగ్లీషునే వాడినట్టున్నారు. గీతాదేవి అన్వేషణ దేని కోసం? - అన్నది తరువాతి ముఖ్యమైన ప్రశ్న. ఆమెకు కావలసింది ఆవిడ మాటల్లోనే చెప్పాలంటే, రస జీవితం, రసజ్వలనం, రససిద్ధి. అంటే ఏమిటి? 'హిమజ్వాల'లో చాలా సందర్భాల్లో చాలా రకాలుగా అవేమిటో నిర్వచించడానికి గీతాదేవి ప్రయత్నిస్తుంది. అది అనురక్తి ఉన్న ప్రేమ. అది కేవలం శారీరక సంభోగంలో మాత్రమే దొరకదు. "శరీరం మాంసపు యంత్రం కాదు, మీట నొక్కి నురగ కక్కించడానికి. శరీరం ఒక శత తంత్రుల వీణ. మీటి ఆ తంత్రుల మీద మూర్ఛనలు పోతేనే రససిద్ధి". యిష్టమున్న వ్యక్తి సాన్నిధ్యంలో, " శతాబ్దాల రసగానం వినడం". "లాలసా భావంతో ఉత్తేజితమై అనంత విశ్వం రసనాదంలోంచి అనాదిగా చేస్తున్న గానం. మరఫిరంగుల ధ్వనిలో మునిగిపోయిన సౌందర్య మూర్తుల రస కంఠపు ధ్వని." "ప్రేమ మాత్రమే చాలదు. అనురక్తి వుండాలి... అనురక్తి రాగ రంజితం అవ్వాలి".

అర్థానుస్వారంలో రచయిత మళ్ళీ యీ రసానుభూతిని నిర్వచించడానికి ప్రయత్నించాడు. " నా దృష్టిలో - రసానుభూతి, సాహిత్యపు పరమావధి. యింతో అంతో జిజ్ఞాస, యెంతో కొంత ప్రయోజనం దాని అనుగుణ్య లక్ష ణాలు. రసానుభూతి లైంగిక పరిమితం అనే అపోహ వుంది. కానీ తృషా సంస్పందన స్వాభావికంగా విశ్వంతర్లావితం. తృష్ణ పలువిధాల ఆకలిగా అభివ్యక్తమవుతుంది."

అయితే నిర్వచించడానికి యింత కష్టపెట్టిన రసానుభూతి, యిన్ని నిర్వచనాల తర్వాత కూడా స్పష్టాస్పష్టంగా మాత్రమే అర్థమవుతున్న 'రసానుభూతి' - కోసం యేమైనా చేయడానికి సన్నద్ధమైనప్పుడు, దేన్నైనా, యెవరినైనా సరకు చేయకుండా ముందుకెళ్ళిపోవడానికి సిద్ధపడ్డప్పుడు ఆ వ్యక్తికీ, మరో వ్యక్తికీ (లేక మరో వ్యక్తి రూపంలో ఉన్న సమాజానికీ) మధ్య ఘర్షణ తప్పదు. " నాక్కావలసింది పచ్చని పచ్చిక, పచ్చిక హృదయం. ప్రపంచంలో యేవొక్కరి కోసమూ నన్ను నేను వంచించుకోలేను. కానీ, వొక్క రసస్పందన కోసం, వెన్నెల స్పర్శ కోసం, రసహృదయపు లోతుల పలవరింత కోసం, నా సర్వస్వాన్నీ అర్పించుకోగలను. అది లభ్యం కానప్పుడు, నాకు యేదీ లక్ష్యం లేదు. నువ్వే కాదు, యెవరి తోటీ నా జీవితాన్ని బండరాయిలా చేసి పడేసుకుని నన్ను నేను క్షమించుకోలేను. ప్రపంచం హృదయమంత సువిశాలమైంది, అన్వేషిస్తూ సెగలాంటి బాధతో సాగిపోతాను," అనగలిగే వ్యక్తివాద పరాకాష్ఠకు సంఘంలో యెదురు దెబ్బలు తప్పవు. గీతాదేవికి భర్త రూపంలో యెదురైన సంఘం " నీ తల వొంచగల వాణ్ణి నేనొక్కణ్ణే- నీతో పాటూ నేనూ వస్తాను. శాశ్వతంగా నిన్ను చిత్రహింస పెడుతూ నీ తోనే నీ లోనే వుండిపోతాను. పద పద - నరకానికి. అది నీ పుట్టిల్లూ అత్తిల్లూ కూడా - శాశ్వతంగా నిన్ను నాలో, నన్ను నీలో ..." అంటూ నలిపి పారేస్తుంది. కృష్ణచైతన్యతో జీవించడానికి సన్నద్ధమైన గీతాదేవికి అనుకోకుండా శివరాం యెదురవడం, ఆమెను ప్రార్థించి, వేధించి, కవ్వించి, చివరికి చంపిపారేయడం - యిదంతా ప్రతీకాత్మకంగా సాగిన ముగింపు.

నిజానికి యే వ్యక్తికైనా తనకున్న రసస్వభావానికి సరిగ్గా సరిపోయే సమతౌల్యపు రసజీవి దొరకడం సాధ్యకాదు. అందులో సైతం సర్దుబాట్లు తప్పవు. కృష్ణచైతన్యలో మాత్రం ఆమెకిప్పుడు తాను కోరుకునే రససిద్ధి యెంతకాలం దొరుకుతుంది? అది సమృద్ధిగా దొరికిందనుకున్న విజయసారధి మరికొంత కాలం బ్రతికుంటే యేం జరిగి వుండేది? కేవలం రససిద్ధి మాత్రమే గమ్యంగా, చివరికి సాంఘిక నియమాలను కూడా త్యజించి అతడి తండ్రితో కలసి జీవించిన తానే, మళ్ళీ కొడుకు తోనూ రసజీవనానికి పూనుకున్నప్పుడు - నైతిక సూత్రాలను సైతం పట్టించుకోని వ్యక్తి వాదానికి - ముగింపు యేమిటి?

వ్యక్తికీ సంఘానికీ మధ్య జరిగే యీ పోరాటంలో వ్యక్తిదే వోటమి. రససిద్ధి కోసం వ్యక్తిలో సాగిన యీ 'హిమజ్వాల' లో శలభమై మాడిపోయేది ఆ వ్యక్తే! అందుకే ముగింపు తో బాటూ గీతాదేవి చావు కూడా ప్రతీత్మకమే! ఆ అవగాహన కలిగినందువల్లనే కృష్ణచైతన్య చివరిలో " జీవితం సమాప్తమవలేదు. యింకా జరగాల్సి వుంది - అంత్యక్రియలు. వీళ్ళవి కాదు. నిరంతరం జరిగే తన అంత్యక్రియలు" అంటాడు.

సంఘం నిర్దేశించిన చట్రాలను (**Moulds**) ఛేదించదలచుకున్న వాళ్ళు, చివరకు తమను తామే నాశనం చేసుకోవడమే జరుగుతోంది. అలాగని వాటిని భగ్నం చేయడానికి ప్రయత్నించేవాళ్ళు వుండకుండా వుండరు. తెలిసి తెలిసీ యెదురు తిరగడం, తెగే గాకా లాగడం - యిది గూడా మానవ ప్రవృత్తిలోని వొక భాగమే.

'హిమజ్వాల'ను స్త్రీ వాద నవలగా గూడా చదివే ప్రయత్నం చేయవచ్చు. అయితే అలా చేయడం ఆ నవలకున్న పరిధిని తగ్గించడమే. ప్రతి వ్యక్తిలోనూ యేదో కొంత నిష్పత్తిలో వున్న వ్యక్తివాదపు- అరాచకవాదపు ప్రతీక గీతాదేవి. వ్యక్తులున్నంతవరకూ సామాజికవాదమూ, సామాజికవాదమున్నంతవరకూ వ్యక్తివాదమూ వుంటాయి. తత్ఫలితంగా ఆ రెండింటి మధ్య ఘర్షణలూ ఉంటాయి. ఆ ఘర్షణలున్నంత వరకూ గీతాదేవి సాగించిన "హిమజ్వాల" అర్థవంతంగానే ఉంటుంది.

తనకు కావలసిన దాని కోసం సమాజాన్ని యెదిరించే వ్యక్తి వాదానికి సమాజవాదులు పరిమితులున్నాయని నమ్ముతారు. అలాగే తాను నిర్ణయించినవిధానాల కనుగుణంగానే వ్యక్తులు నడుచుకోవాలనే సమాజవాదానికి కూడా వ్యక్తివాదులు పరిమితులుండాలని ఆశిస్తారు. వీటి యెల్లలను నిర్ణయించడంలో యిరువురికీ యేకా భిప్రాయం వుండదు. అందుచేత గీతాదేవి సాగించిన అన్వేషణ పట్ల వ్యక్తి వాదులకున్నంత గౌరవం సామాజిక వాదులకుండదు. అయితే సామాజికవాదులు సైతం వొకసారి అంతర్ముఖులై తమ జీవనశైలిలో తమకే తెలియకుండా సాగుతున్న అరాచక తృష్ణను, పాటిస్తున్న అరాచక విధానాలను గుర్తించ గలిగినప్పుడు గీతాదేవి అనే ప్రతీకాత్మక పాత్రకున్న విశిష్టత బోధపడుతుంది. వాదాలను ప్రతిపాదించినంత సులభంగా వ్యక్తులను నిర్వచించలేం. ప్రతి మనిషిదీ వొక సంక్లిష్టమైన వ్యక్తిత్వం. దాన్ని గుర్తించ గలిగినప్పుడే సామాజిక పురోభివృద్ధికి చేయవలసిన దోహదమేదో బోధపడుతుంది.

back to book of the week home page

ఈ విశేష సమీక్షా వ్యాసం తెలుగు అసోసియేషన్ ఆఫ్ సెంట్రల్ ఒహాయో( కొలంబస్-ఒహాయో) వదాన్య సౌజన్యంతో అందించబడింది